


పెచ్చులూడిన సీమలవానివలస పాఠశాల భవనం స్లాబు

నాడు గొప్పలు.. నేడు తిప్పలు

- గత వైసీపీ ప్రభుత్వ తీరుతో ప్రభుత్వ విద్యకు తూట్లు
- నిబంధనల పేరుతో అడ్డంకులు
- పాఠశాల శిథిల భవనాలకు కలగని మోక్షం
- ప్రస్తుతం చెట్ల కింద, వరండాల్లో బోధన
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- నూతన ప్రభుత్వంపైనే ఆశలు



వరండాలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: 'నాడు-నేడు'తో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశామని గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. కానీ నిబంధనల పేరిట వైసీపీ అనుసరించిన విధానాలతో ప్రభుత్వ విద్యకు తూట్లు పడ్డాయి. క్షేత్రస్థాయిలో 'మన్యం'లో నెలకొన్న పరిస్థితులే ఇందుకు నిదర్శనం. జిల్లాలో ఇప్పటికీ అనేక పాఠశాలలు శిథిల భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అవి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి. కొన్నిచోట్ల వరండాల్లో, చెట్ల కింద తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. మొత్తంగా ప్రభుత్వ బడులపై ఆసక్తి ఉన్నా.. సౌకర్యాల లేమితో జిల్లాలో ఎంతోమంది విద్యార్థులు చదువుకు దూరమవుతు న్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లా పరిధిలో అధిక పాఠశాలల భవనాలు శిథిలావస్థలోనే ఉన్నాయి. గత ఐదేళ్లు అలానే నెట్టుకొచ్చారు. కాగా 15 మండలాల్లో పది మంది విద్యార్థుల లోపు ఉన్న పాఠశాలలు సుమారు 356కు పైగా ఉన్నాయి. బడిలో 20 మందికి పైగా విద్యార్థులుంటే నూతన భవనం మంజూరుకు అవకాశం ఉంటుందని గత ప్రభుత్వ హయాంలో నిబంధనలు విధించారు. దీంతో జిల్లాలో అధిక శాతం పాఠశాలలకు కొత్త భవనాలు మంజూరు కాలేదు. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో చెట్ల కింద, పశువుల శాలల్లో, శిథిల భవనాల వరండాల్లో చదువులు చెప్పాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియక విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

- గరుగుబిల్లి మండలం చిలకాం పంచాయతీ కారివలసలో పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో విద్యార్థులకు చెట్ల కింద, పశువుల శాలల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. శివ్వాం పంచాయతీ సీమలవానివలస (గిరిజన గ్రామం)లో శిథిలమైన పాఠశాల వరండాలోనే విద్యార్థులకు బోధిస్తున్నారు. ప్రతి మండలంలో ఈ సమస్యలున్నాయి.

పది మంది లోపు విద్యార్థులున్న పాఠశాలలు

బలిజిపేట మండలంలో 13, భామినిలో 7, గుమ్మలక్ష్మీపురంలో 49, గరుగుబిల్లిలో 7, జియ్యమ్మవలసలో 30, కొమరాడలో 27, కురుపాంలో 69, మక్కువలో 17, పాచిపెంటలో 28, పాలకొండలో6, పార్వతీపురంలో 19, సాలూరులో 49, సీతంపేటలో 15, సీతానగరంలో 14, వీరఘట్టాంలో 6 పాఠశాలల్లో పది మంది లోపు విద్యార్థులు ఉన్నారు. గత ప్రభుత్వ నిబంధనల కారణంగా ఆయా బడులకు నూతన భవనాలు మంజూరు కాలేదు. ప్రస్తుతం ఆయా పాఠశాలలు శిథిల భవనాల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో గ్రామాల పరిధిలోని చాలామంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు. నూతన భవనాల మంజూరు, సౌకర్యాలు కల్పించకపోవడంతో ఆర్థిక భారమైనా తప్పనిసరి పరిస్థితులో పలు గ్రామాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ బడుల్లో చేర్పించారు.



పశువుల శాలలో బోధిస్తున్న దృశ్యం (ఫైల్)



కారివలసలో చెట్టు కింద విద్యార్థులకు బోధిస్తున్న దృశ్యం (ఫైల్)

సౌకర్యాలు కల్పిస్తే..

పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి.. నూతన భవనాలు మంజూరు చేస్తే.. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు కూడా చొరవ చూపితే విద్యార్థుల సంఖ్య పెరగనుంది. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, జిల్లావాసులు కోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు చెప్పిందే తడవుగా భవనాలు మంజూరు చేయించారని.. దీంతో నాడు-నేడులో నిబంధన లకు విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపణ లున్నాయి. కొన్నిచోట్ల భవనం శిథిలమైనా నిర్మాణానికి ముందుకు రాకుండా తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మొత్తంగా ప్రభుత్వ బడుల్లో సౌకర్యాల కంటే హంగులకే అధిక ప్రాధాన్యం ఇచ్చి కాంట్రాక్టర్ల జేబులు నింపారనే విమర్శలున్నాయి. విద్యార్థులు ఉన్న చోట భవనాలు శిథిలమై ఉండగా, లేని చోట హంగులతో భవనాలు నిర్మించారనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

నిబంధనలు సడలించాలి

గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అత్యధిక శాతం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు. నిబంధనలు సడలించి శిథిల భవనాలకు మరమ్మతులు చేపడితే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. స్థానిక శాసనసభ్యులు ప్రత్యేక చొరవ చూపాలి. ఉపాధ్యాయులకు విద్యార్థుల సంఖ్యపై నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేయాలి.

- డి.సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు, నాగూరు

ఉన్నతాధికారులకు నివేదించాం

జిల్లా పరిధిలోని పలు పాఠశాలల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిబంధనలు సడలిస్తే అవసరమైన చర్యలు చేపడతాం. ప్రస్తుతం మరమ్మతులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. 20 మంది దాటి విద్యార్థులు ఉంటేనే భవనం మంజూరుకు అవకాశం ఉంది.

- జి.పగడాలమ్మ, డీఈవో, పార్వతీపురం మన్యం

ప్రతివారం ప్రగతి కనిపించాలి

- అభివృద్ధి పనులపై అధికారులను ఆదేశించిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అభివృద్ధి పనులపై ప్రతి వారం ప్రగతి కనిపించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. 'మన్యం'లో అభివృద్ధి పనులు వేగవంతం కావాలని, ప్రతివారం పురోగతి కనిపించాలని సూచించారు. ప్రభుత్వ సూచనల మేరకు వంద రోజులు, సంవత్సరం, ఐదు సంవత్సరాల ప్రణాళికలు పక్కాగా రూపొందించా లని తెలిపారు. ప్రతి శాఖ తమ పరిధిలో జరగాల్సిన పనులు, పెండింగ్ అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాల ప్రధాన రహదారులపై గుంతలు పూడ్చాలని, వాగులు, వంకలు, ఇతర ప్రదేశాల వద్ద సూచన బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కొటికిపెంట ఏలవ్య పాఠశాల భవనాల పనుల జాప్యంపై గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికా రులను ప్రశ్నించారు. పీఎం జన్‌మాన్, గ్రామీణ్, అర్బన్ తదితర విభాగాల్లో లక్ష్యం మేరకు రెండువేల గృహాల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు మంగళ, శుక్రవారాలు విధిగా మం డలాల్లో పర్యటించాలని ఆదేశించారు. అనంతరం పశు సంవర్థక శాఖ పోస్టర్‌ను విడుదల చేశారు. సమావే శంలో జేసీ శోభిక, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, ఆర్డీవో హేమలత తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపడాలి

అర్జీల పరిష్కారంలో మండల యంత్రాంగం పనితీరు మెరుగుపడాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులతో సమీక్షించారు. సాలూరు, సీతంపేట నుంచి ఎక్కువ వినతులు వస్తున్నాయన్నారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలు జిల్లా స్థాయికి ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఇలా అయితే మండల స్థాయి పరిపాలనా యంత్రాంగం విఫల మైనట్టు భావించాల్సి ఉంటుందన్నారు. రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి రికార్డులు, ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాల్సిందేనని తెలిపారు. ఫిర్యాదులు రీ ఓపెనింగ్ కాకుండా చూడాలన్నారు. రోజువారి లక్ష్యాల సాధనపై గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజనీర్లను ప్రశ్నించారు. గృహ నిర్మాణాలు ఆగరాదన్నారు. పౌష్టి కాహారంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

వేడుకగా రక్షాబంధన్



రక్షాబంధన్ జిల్లాలో ఓ వేడుకలా జరిగింది. సోదరీమణులంతా సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు పంచిపెట్టారు. బహుమతులు పొందారు. వాటిని ఇతరులకు చూపుతూ రోజంతా సరదాగా గడిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు బ్రహ్మకుమారీలు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

కూరుకుపోతున్నాయ్..

- బిల్లుమడ వద్ద అధ్వానంగా రహదారి
- బురదలో దిగబడుతున్న వాహనాలు



రహదారిపై బురదలో కూరుకుపోయిన లారీలు

భామిని : భామిని మండలం బిల్లుమడ వద్ద రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు ఇక్కట్లు తప్పడం లేదు. నులకజోడు సెంటర్ వరకు దారి పొడవునా భారీ గోతులు ఏర్పడగా.. వాటిల్లో వర్షపునీరు చేరింది. కొన్నిచోట్ల రోడ్డు బురదమయంగా మారడంతో రెండు రోజులుగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆది వారం కూడా ఈ మార్గంలో లారీలు బురదలో కూరుకుపోవడం, ఎక్స్‌కవేటర్ సాయంతో వాటిని తొలగించారు. కాగా సోమవారం తెల్లవారుజామున రెండు లారీలు ఈ రోడ్డుపై బురదలో కూరుకుపోయాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. రహదారికి ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. బత్తిలి వైపు నుంచి వచ్చిన ప్రయాణికులు ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నానా అవస్థలు పడ్డారు. ఆ తర్వాత ఎక్స్‌కవేటర్ సాయంతో లారీలను తొలగించారు. ఆ మార్గంలో గ్రావెల్ వేయడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు వాహనాల రాకపోకలు సాగాయి. ఆ తర్వాత మరో లారీ బురదలో దిగబడింది. దానిని కూడా యంత్రం సాయంతో పక్కకు తొలగించారు. మొత్తంగా సాయంత్రం ఆరు గంటల తర్వాత యథావిధిగా బత్తిలి, ఒడిశా వైపు వాహనాల రాకపోకలు సాగాయి. అయితే ఆర్టీసీ బస్సులు మాత్రం నులకజోడు సెంటర్ నుంచే తిరిగి శ్రీకాకుళం వైపు వెళ్తున్నాయి. దీంతో ప్రయాణికులు స్వగ్రామాలకు చేరేందుకు నానా అవస్థలు పడ్డారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఈ రహదారిపై ఉన్నతాధికారులు స్పందించాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

ఐఏఎస్ స్థాయి అధికారి మాకూ కావాలి..

- సీతంపేట ఐటీడీఏకు పీవోగా నియమించండి
- గిరిజనుల వినతి
- ప్రస్తుతం ఆర్డీవోకు ఇన్‌చార్జి పగ్గాలు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏకు నాలుగు దశాబ్దాల చరిత్ర ఉంది. ఇప్పటివరకు 17 మంది ఐఏఎస్‌లు పీవోలుగా పనిచేశారు. నలుగురు జాయింట్ కలెక్టర్లు ఇన్‌చార్జి పీవోలుగా విధులు నిర్వర్తించారు. గిరిజన సంక్షేమశాఖ డీడీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ఆర్డీవో, జిల్లా అటవీశాఖ, డ్వామా పీడీలు కూడా కొంతకాలం ఇన్‌చార్జి ఐటీడీఏ పీవోలుగా బాధ్యతలు కట్టబెట్టారు. వాస్తవంగా 1984-85లో టీడీపీ ప్రభుత్వ హయాంలో సీతంపేట ఐటీడీఏను నెలకొల్పారు. గిరిజనులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఐఏఎస్ అధికారులను నియమించారు. అయితే రాను రాను సీతంపేట ఐటీడీఏ పాలనపరంగా ప్రాధాన్యం కోల్పోడంతో గత ప్రభుత్వాలు అధిక శాతం ఇన్‌చార్జిలకే అదనపు బాధ్య తలు అప్పగిస్తూ వచ్చాయి.



2019 తర్వాత వైసీపీ అధికారం లోకి వచ్చిన తర్వాత తరచూ పీవోలను బదిలీలు చేస్తూ.. ఇన్‌చార్జిలతోనే నెట్టుకొచ్చింది. కాగా ఇటీవల ఐటీడీఏ పీవో బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఆర్డీవోకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. పక్కనే ఉన్న పార్వతీపురం ఐటీడీఏలో మాత్రం ఐఏఎస్ అధికారిని ఐటీడీఏ పీవోగా నియమించారు. బదిలీల ఉత్తర్వుల్లో సీతంపేట ఐటీడీఏ లేపోవడంతో ఆదివాసీలు కొంత నిరాశకు గురయ్యారు.

గతంతో పోల్చుకుంటే...

1984-85లో ఐఏఎస్ క్యాడర్‌కు చెందిన అజయేంద్ర పాల్ , 1986లో ఐఏఎస్ అధికారి మృత్యుంజయ సాహు, ఏడాది తర్వాత జాయింట్ కలెక్టర్ వై.శామ్యూల్, ఐఏఎస్ అధికారులైన కె.కె.శర్మ, ప్రేమచంద్, నరసింగరావులు పీవో లుగా పనిచేశారు. ఆ తర్వాత జేసీ ఎస్.భట్టాచార్య, గ్రూప్-1కు చెందిన అనురాధ, అనంతరం ఐఏఎస్ అధికారి గిరిధర్ పీవోగా ఉన్నారు. 1991 తర్వాత టీడీపీ ప్రభుత్వం ఐఏఎస్‌లను పీవోగా నియమించింది. 2005 నుంచి 2016 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్-1 అధికారులతోనే నెట్టు కొచ్చింది. 2019 వరకు టీడీపీ ప్రభుత్వం ఐఏఎస్ అధికా రులనే పీవోలుగా నియమించింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన సీన్ మారింది. అయితే ఇప్పుడు ఐఏఎస్ అధికారిని పీవోగా నియమించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఆ బాధ్యత ఈడబ్ల్యూఏలదే..

- పాఠశాల టాయిలెట్ల ఫొటోల అప్‌లోడ్‌పై ఉత్తర్వులు జారీ



సాలూరు రూరల్, ఆగస్టు 19: ప్రభుత్వ పాఠశాలల టాయిలెట్ల ఫొటోలను టీఎంఎఫ్ యాప్‌లో అప్‌లోడ్ చేసే బాధ్యత ఇకపై గ్రామాల్లో ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, పట్టణాల్లో వార్డు ఎడ్యుకేషన్ కార్యదర్శిలది. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ మిడ్ డే మీల్ విభాగం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులతో మరుగుదొడ్ల ఫొటోలు తీయించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. మంత్రి నారా లోకేష్ తానిచ్చిన హామీ మేరకు మరుగుదొడ్ల ఫొటోల యాప్ భారం ఉపాధ్యా యులకు తప్పించారు. అయితే పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ దెబ్బతినకుండా ఉండడానికి విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇకపై బాత్‌రూమ్‌ల ఫొటోలు తీసి ఐఎంఎస్ యాప్‌లో, టీఎంఎఫ్‌లో అప్‌లోడ్ చేసే బాధ్యతను గ్రామాల్లో ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సహాయకులు, పట్టణాల్లో వార్డ్ ఎడ్యుకేషన్ కార్యదర్శి అప్పగించారు. వారు ప్రతీ సోమ, గురువారాల్లో తమ పరిధిలో ఉన్న పాఠశాలలకెళ్లి ఫొటోలు తీయాల్సి ఉంది. స్కూల్ మేనేజ్‌మెంట్ ఛైర్మన్, సభ్యులు బుధ,శుక్రవారాల్లో ఐఎంఎస్ యాప్‌లో ఫొటోలు అప్లోడ్ చేయాల్సి ఉంది. పాఠశాలల్లో పరిశుభ్రత తదితర అంశాలను ఈడబ్ల్యూఏ, డబ్ల్యుఈఎస్, ఎస్ఎంసీలు పర్యవేక్షించాల్సి ఉంది.

23న గ్రామసభలు

- పంచాయతీల్లో నిర్వహించాలని డిప్యూటీ సీఎం ఆదేశం
- వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు దిశానిర్దేశం
- 'ఉపాధి'లో చేపట్టాల్సిన పనుల ఆమోదం కోసం కసరత్తు



కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా అధికారులు

పార్వతీపురం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఈ నెల 23న గ్రామ సభలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనుల ఆమోదం కోసం గ్రామ సభల నిర్వహణ, అందుకు సంబంధించిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. 'గ్రామ సభలను పారదర్శకంగా నిర్వహించాలి. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు, వాటి వివరాలను తెలియజేసే విధంగా పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలి.' అని డిప్యూటీ సీఎం తెలిపారు. అనంతరం బలిజిపేట మండలం పెదపెంకిలో పారిశుధ్యంపై ఆయన ఆరా తీశారు. పంచాయతీల్లో పారిశుధ్యం సక్రమంగా లేదని, ఫైలేరియా వ్యాధి వ్యాపిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పంచాయతీలో సిఫారసులను పరిగణనలోనికి తీసుకొని అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

చేపట్టాల్సిన కార్యక్రమాలు..

- ఉపాధి హామీ పథకం ద్వారా వేతనాలు పొందేవారి హక్కులు, అర్హతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలి. ఇప్పటికే మంజూరు చేసిన, పురోగతిలో ఉన్న పనులను గ్రామసభల్లో చదివి ప్రజలకు వివరించాలి. 2024-25 సంబంధించి కొత్త పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. సోషల్ ఆడిట్ ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. గ్రామసభలను సజావుగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలి.
- కొత్తగా ఫీడర్, పంట కాలువలు, రైతుల భూముల్లో ఫార్మ్ పాండ్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. పొలం గట్లపై మొక్కల పెంపకంపై అవగా హన కల్పించాలి. ప్రజల వ్యక్తిగత భూముల్లో అభివృద్ధి పనులు చేప ట్టాలి. రైతుల భూముల సరిహద్దుల్లో కందకాలు నిర్మించాల్సి ఉంది. పండ్ల తోటల్లో రింగు ట్రెంచ్‌ల ఏర్పాటు, భూసార సంరక్షణ కందకాల తవ్వకాలు, రైతుల భూముల్లో గడ్డి , పూలతోటల పెంపకం వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీవో బి.సత్యనారాయణ, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ప్రభాకరరావు, డ్వామా పీడీ రామచంద్రరావు, పంచాయతీ ఇంజనీరింగ్ అధికారి కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణకు సన్నాహాలు

గరుగుబిల్లి: గ్రామసభల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. మండల స్థాయిలో ఉపాధి సిబ్బందికి ఎంపీడీవోలు, ఏపీవోలు అవగాహన కల్పిస్తూ సమాచారాన్ని అందించారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శి గ్రామసభ నిర్వహించి ప్రత్యేక రిజిస్టర్ నిర్వహణ, తీర్మానాలు చేయాల్సి ఉంది. ప్రతి పంచాయతీలో విధిగా గ్రామసభలు నిర్వహణకు ముందుగా ప్రచారం చేయాలి. డ్వామా పీడీ గుర్తించిన పనులను పంచాయతీల వారీగా అమలు పర్చాలి ఉంది. వ్యవసాయ పనులతోపాటు లబ్ధిదారులకు సంబంధించిన వాటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. ఉపాధి నిధులతో పనులు నిర్వహించే శాఖల అధికారులు విధిగా హాజరుకావాల్సి ఉంది. గుర్తించిన పనులకు సంబంధించి ప్రతిపాదనలను మండల పరిషత్, జడ్పీ, కలెక్టర్, ప్రాజెక్టు డైరెక్టర్లు పరిపాలన అనుమతులు మంజూరు చేయాల్సి ఉంది. మండ లాలవారీగా ప్రతిపాదించిన పనులు వివరాలను సంబంధిత ఉపాధి సిబ్బంది సాఫ్ట్ డీ2లో పొందుపర్చాలి. మొత్తంగా వ్యవసాయ అనుబంధానికి సంబంధించి 46 పనులను కేటాయించారు. పంచాయతీల్లో సీసీ రహదారులు, డ్రైనేజీలు, బీటీ రహదారులు, పాడి పశువుల షెల్టర్లు, సెరీ కల్చర్ షెడ్లు, ఉద్యానశాఖ, మల్బరీ యూనిట్లు, ఎవెన్యూ ప్లాంటేషన్లు, ఫారం పండ్స్, ఇంకుడు గుంతలు, వర్షపు నీరు నిల్వ కేంద్రాలు, సామూహిక సోప్ ఫిట్స్, వ్యక్తిగత సోప్ ఫిట్లుతో పాటు పలు రకాల పనులను గ్రామసభల్లో గుర్తించి ప్రతిపాదనలు చేయాల్సి ఉంది.

నిబంధనల మేరకు..

నిబంధనల మేరకు గ్రామసభలు నిర్వహించాలి. లేకుంటే చర్యలు తప్పవు. ఇప్పటికే ఎంపీడీవో, ఉపాధి ఏపీవోలకు ఆదేశాలు జారీ చేశాం. గ్రామసభలకు ముందుగా దండోరా వేయించాలని సూచించాం. గ్రామసభలు నిర్వహణ, అనుమతులు మంజూరు, తదితర అంశాలపై తెలియజేశాం.

- కె.రామచంద్రరావు, డ్వామా పీడీ, పార్వతీపురం మన్యం

దిక్సూచి DIKSUCHI



భారత వాయుసేనలో అగ్నివీర్ ఉద్యోగాలు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా క్రీడల విభాగంలో అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది.

- **భారత వాయుసేన- అగ్నివీర్ వాయు(స్పోర్ట్స్) ఇన్‌టేక్ 01/2025**

క్రీడాంశాలు: అథ్లెటిక్స్, బాక్సింగ్, క్రికెట్, సైక్లిం గ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్/డైవింగ్, షూటింగ్, వాటర్ పోలో, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, సైకిల్ పోలో, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, స్క్వాష్, కబడ్డీ, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, ఉషు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/10+2/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. లేదా ఇంజనీరింగ్‌లో డిప్లొమా కోర్సు(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/ కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ). నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలతో పాటు స్పోర్ట్స్ అచీవ్‌మెంట్స్ తప్పనిసరి.

ఎత్తు: 152 సెం.మీ. కనీస ఎత్తు ఉండాలి.

వయోపరిమితి: 2004 జనవరి 2 నుంచి 2007 జూలై 2 మధ్య జన్మించిన అభ్యర్థులు అర్హులు.

ఎంపిక ప్రక్రియ: సెలెక్షన్ టెస్ట్, స్పోర్ట్స్ స్కిల్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా.

దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 29

ట్రయల్స్ వేదిక: తేజస్ క్యాంప్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్ న్యూఢిల్లీ, లోక్ కల్యాణ్ మార్గ్, న్యూఢిల్లీ.

వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in/AV/

(నిన్నటి దిక్సూచి తరువాయి)

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఎస్సీ ఉప వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పు-నేపథ్యం

పంజాబ్ రాష్ట్ర పాత్ర

2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆంధ్రప్రదేశ్ సహా పంజాబ్ రాష్ట్రాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేసింది. 1975లో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్రంలోని ఎస్సీల్లో మరింత అట్టడుగున ఉన్న బాల్మీకి, మజ్‌హబి కులాలను వర్గీకరించి వారికి విద్య, ఉద్యోగాది విషయాల్లో తొలి ప్రాధాన్యం ఇచ్చింది. ఇందుకోసం ఒక జీవోను జారీ చేసింది. 30 ఏళ్లపాటు అమల్లో ఉన్న ఈ విధానం, 2004లో ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయవివాదంలో చిక్కుకుంది.

2006లో డాక్టర్ కృష్ణపాల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో, పంజాబ్, హర్యానా హైకోర్టు 1975 నాటి పంజాబ్ రాష్ట్ర జీవో చెల్లదని, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా తీర్పునిచ్చింది. అయితే ఈ తీర్పును అధిగమించడానికి పంజాబ్ ప్రభుత్వం 'పంజాబ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ అండ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్(రిజర్వేషన్ ఇన్ సర్వీసెస్)యాక్ట్-2006ను తీసుకువచ్చి తిరిగి బాల్మీకి, మజ్‌హబీ వర్గాలకు ఎస్సీ రిజర్వేషన్లలో తొలి ప్రాధాన్యం ఇచ్చారు. 2010లో మరోసారి హైకోర్టు ఈ చట్టాన్ని కొట్టివేసింది. అయితే దేవేందర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసులో వచ్చిన ఈ తీర్పును పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. 2014లో ఈ అప్పీలును సుప్రీంకోర్టు అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేసి, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునఃసమీక్షించాల్సిందిగా సూచించింది. జస్టిస్ అరుణ్‌మిశ్రా నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పును పునః పరిశీలించాలని అభిప్రాయపడింది. ఎస్సీల్లో, ఎస్టీల్లో మరింత ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుకు గురవుతున్న ఉప వర్గాలున్నాయని, ప్రభుత్వాలు, కోర్టులు దీనిని విస్మరించజాలమని అభిప్రాయపడుతూ ఇ.వి.చెన్నయ్య కేసును పరిశీలించిన ధర్మాసనం కూడా తమవలే అయిదుగురు సభ్యులు కలది కావడంతో ఆ తీర్పును తిరగరాయాలంటే మరింత ఎక్కువమంది సభ్యులు గల ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును చేపట్టాలని సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో 2023 డిసెంబరులో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలో స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దేవేందర్‌సింగ్ కేసును పరిశీలించడానికి, ఇ.వి.చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించడానికి ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పడింది.

ప్రాథమికంగా ఈ రాజ్యాంగ ధర్మాసనం రెండు విషయాలను పరిశీలించింది. అవి 1) రిజర్వేషన్లలో ఉపవర్గీకరణను అమలుచేయాలా? 3) ప్రకరణ 341 ప్రకారం ఎస్సీలు ఒకే సజాతీయ సమూహంగా గుర్తించబడ్డారు కాబట్టి వారిని ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు లేదని తీర్పు ఇచ్చిన ఇ.వి.చెన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసు సమంజసత్వం. ఈ కేసు విషయంగా 2024 ఆగస్టు 1న 6:1 మెజారిటీతో జస్టిస్ చంద్రచూడ్ రాజ్యాం గ ధర్మాసనం తీర్పునిస్తూ ఎస్సీలను ఉపవర్గీకరించే అధికారం రాష్ట్రాలకు ఉందని, 2004 నాటి ఇ.వి.చెన్నయ్య కేసు తీర్పు చెల్లుబాటు కాదని, సమానత్వాన్ని మరింత పెంపొందించేందుకు అభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయికి చేర్చేందుకు ఎస్సీల్లోనే కాక, ఎస్టీల్లో కూడా రిజర్వేషన్లు ఉపవర్గీకరించి అమలుచేయాల్సిన ఆవశ్యకత ఉందని, ఆ దిశగా రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలని సూచించింది. అదేవిధంగా ఈ తీర్పుతో ఏకీభవిస్తూనే ప్రత్యేకంగా తన తీర్పును వినిపించిన ధర్మాసనం న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో కూడా ప్రభుత్వాలు క్రిమిలేయర్ విధానాన్ని తీసుకువచ్చినప్పుడే అట్టడుగు వర్గాలకు మరింత న్యాయం చేకూరుతుందని సూచించారు. అదేవిధంగా ఉపవర్గీకరణ చేయడానికి సముచిత ప్రాతిపదికలను, వెనుకబాటుతనాన్ని వారి మధ్య గుర్తించడానికి సరైన కొలమానాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఎంచుకోవాలని ఏ ఉపవర్గానికీ 100 శాతం రిజర్వేషన్లను కేటాయించరాదని సూచించారు.

బంతి రాష్ట్రప్రభుత్వాల కోర్టులో

సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు మార్గం సుగమం అయ్యింది. అయితే ఈ ఉపవర్గీకరణను సమర్థవంతంగా పూర్తిచేయడానికి రాష్ట్రాలు కుల గణను సమర్థవంతంగా చేపట్టాల్సి ఉంది. అంతేకాక ఏయే ఉప కులాలు ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా తమ కేటగిరీలోని ఇతర కులాలతో పోల్చినా ఏ స్థాయిలో ఉన్నాయో అంచనా వేయాల్సి ఉంది. ప్రాంతీయపరంగా కూడా వివిధ ఉపకులాల్లో అభివృద్ధిలో అసమానతలు ఉన్నా యి. అంతేకాక ఈ ఉపవర్గీకరణ దళితుల్లోని ఐకమత్యాన్ని దెబ్బ తీయడం తప్ప పెద్దగా ఒన గూడే ప్రయోజనాలు లేవని మాల మహానాడు వంటి సంఘాలు ఉపవర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయి.

అంతేకాక ఎస్టీల నుంచి లంబాడాలను తొలగించాలని వారు మైదాన ప్రాంతాల్లో ఉంటూ అభివృద్ధి చెంది ఆదివాసీ కొండజాతి వారి అవకాశాలకు గండికొడుతున్నారని ఆదివాసీ తెగలు ఉద్యమిస్తున్నాయి. ఇట్టి అంతర్గత సంఘర్షణలను సైతం రాష్ట్రాలు ఎదుర్కోవాల్సి ఉంది. సుప్రీంకోర్టు సూచించినవిధంగా ఈ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను రాజకీయ ప్రయోజనాల కోసం కాక, సమసమాజ స్థాపన దిశగా వినియోగించాల్సిన గురుతర బాధ్యత రాష్ట్రప్రభుత్వాలపై ఉంది.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/jse4ruCలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

ఇన్ ప్రోగ్రెస్



కుర్రోళ్ల కష్టం కనిపించింది

నిహారిక కొణిదెల సమర్పణలో రూపుదిద్దుకున్న 'కమిటీ కుర్రోళ్లు' చిత్రాన్ని చూసిన మెగాస్టార్ చిరంజీవి ఆ సినిమా టీమ్‌ను తన ఇంటికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. నిహారిక, దర్శకుడు యదు వంశీ తదితరులు ఆయన్ని కలిశారు. 'సినిమా చాలా చక్కగా ఉంది. కొత్త వాళ్లు నటిస్తున్నారనే విషయాన్ని సినిమా చూస్తున్నంతసేపూ మరిచిపోయా. చిత్రీకరణ చాలా సహజంగా ఉంది. ఎంటైర్ యూనిట్ పడిన కష్టం తెరపై కనిపించింది. రీజనబుల్ బడ్జెట్‌లో సినిమా తీసిన దర్శకుడు యదు వంశీకి అభినందనలు' అని ప్రశంసించారు చిరంజీవి.

బ్రహ్మా ఆనందం సందడి



హాస్య బ్రహ్మ బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ తాతా మనవళ్లుగా నటిస్తున్న 'బ్రహ్మా ఆనందం' చిత్రం గ్లింప్స్‌ను రాఖీ పండగ సందర్భంగా సోమవారం విడుదల చేశారు. బ్రహ్మానందం, రాజా గౌతమ్, వెన్నెల కిశోర్ .. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే కథతో వినోదాల విందు వడ్డించడానికి కొత్త దర్శకుడు ఆర్వీఎస్ నిఖిల్ సిద్ధమవుతున్నారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా తెలిపారు.

కన్నప్ప కోసం కంపడు.. గవ్వ రాజు



విష్ణు మంచు నటిస్తూ, ఎంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్న నటులకు సంబంధించిన లుక్స్ ఒక్కొక్కటి విడుదల చేస్తున్నారు. ఇందులో కంపడు పాత్ర పోషిస్తున్న ముఖేశ్ రిషి, గవ్వరాజు పాత్ర చేసిన బ్రహ్మాజీ లుక్స్ సోమవారం రిలీజ్ చేశారు. పురాతన పుళింద జాతికి చెందిన అత్యంత భయంకరమైన తెగకు సంబంధించిన పాత్రలు ఇవి. డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ షూటింగ్ చివరి దశకు చేరుకుంది. డిసెంబర్‌లో విడుదల కానున్న ఈ చిత్రానికి ముఖేశ్‌కుమార్ దర్శకుడు.

అమ్మాయిలకు ఆమడ దూరం



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటిస్తున్న 'భలే ఉన్నాడే' చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. అమ్మాయిలంటే ఆమడదూరంలో ఉండే హీరో పాత్రను హిలేరియస్‌గా పరిచయం చేసింది ఈ ట్రైలర్. అలాగే టీవీ గణేశ్, హైపర్ ఆది, కృష్ణభగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్ పాత్రలు కూడా వినోదభరితంగా ఉంటాయని దర్శకుడు జె.శివసాయి చెప్పారు. వినాయకచవితి సందర్భంగా సెప్టెంబర్ 7న సినిమాను విడుదల చేస్తున్నట్లు నిర్మాత ఎన్వీ కుమార్ చెప్పారు.

అమాయకత్వం..తింగరితనం...



బాలనటిగా వెండితెరపై అడుగుపెట్టి.. పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు రమ్య పసుపులేటి. ఆమె కథానాయికగా నటించిన చిత్రం 'మారుతినగర్ సుబ్రమణ్యం'. రావు రమేశ్, అంకిత్ కొయ్య, ఇంద్రజ నటించిన ఈ చిత్రాన్ని లక్ష్మణ్ కార్య తెరకెక్కించారు. ఈ నెల 23న సినిమా విడుదలవుతున్న సందర్భంగా రమ్య మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమాలో నా పాత్ర చాలా బాగుంటుంది. అమాయకత్వం, తింగరితనం కలగలిపిన పాత్ర నాది. నా పాత్ర ద్వారా అందరూ హాయిగా నవ్వుకుంటారు. దర్శకుడు లక్ష్మణ్ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. అంకిత్ కొయ్య కలసి నటించడం మరిచిపోలేని అనుభూతి. సెట్స్‌లో రావు రమేశ్, ఇంద్రజ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా తప్పకుండా అందర్నీ మెప్పిస్తుంది" అని చెప్పారు.

రిలీజ్ డేట్ ఖరారు



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'వేట్టైయాన్' విడుదల తేదీ ఖరారైంది. అక్టోబర్ పదిన ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణసంస్థ లైకా ప్రొడక్షన్స్ సోమవారం అధికారికంగా ప్రకటించింది. సామాజికపరమైన సమస్యలు తీసుకుని ఆకట్టుకొనేవిధంగా చిత్రాలు తీసే దర్శకుడు టీజె జ్ఞానవేల్ రూపొందించిన తాజా చిత్రం ఇది. లైకా సంస్థ రజనీకాంత్‌తో నిర్మిస్తున్న ఈ నాలుగో చిత్రంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇది అమితాబ్, రజనీకాంత్ కాంబినేషన్‌లో వస్తున్న నాలుగో సినిమా కావడం మరో విశేషం. అలాగే రజనీకాంత్, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచంద్రన్ కలసి పని చేస్తున్న చిత్రం కూడా ఇదే కావడం గమనార్హం. వేట్టైయాన్' చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ లైకా ప్రొడక్షన్స్ హెడ్ జీకేఎం తమిళ్ కుమరన్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. తమిళ, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

కూర్గ్‌లో పెళ్లి



'రాజావారు..రాణీగారు' చిత్రంలో హీరోహీరోయిన్లుగా నటించిన కిరణ్ అబ్బవరం, రహస్య గోరఖ్‌ల వివాహం ఈ నెల 22న కర్నాటక రాష్ట్రంలోని కూర్గ్‌లో జరుగుతుంది. రహస్య బంధువులంతా కూర్గ్‌లో ఉండడంతో అక్కడే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. సన్నిహితులు, స్నేహితులు, బంధువుల సమక్షంలో ఈ పెళ్లి జరుగుతుంది. దాదాపు ఐదేళ్ల నుంచి ప్రేమలో ఉన్న కిరణ్, రహస్య ఈ ఏడాదే తమ ప్రేమ విషయాన్ని బయట పెట్టారు.

వరల్డ్ ఆఫ్ వాసుదేవ్ : కిరణ్ అబ్బవరం నటిస్తున్న పీరియాడిక్ థ్రిల్లర్ 'క' నుంచి ఫస్ట్ సింగిల్ 'వరల్డ్ ఆఫ్ వాసుదేవ్'ను సోమవారం విడుదల చేశారు. సనాపతి భరద్వాజ పాత్రుడు రాసిన ఈ పాటను కపిల్ కపిలన్ పాడారు. దర్శకద్వయం సుజిత్, సందీప్ విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న 'క' చిత్రాన్ని త్వరలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి విడుదల చేయనున్నారు.

సందేశంతో 'జనక అయితే గనక'



సుహాస్, సంగీర్తన జంటగా నటిస్తున్న చిత్రం 'జనక అయితే గనక'. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్, గోపరాజు రమణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. ఇటీవలే రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. కథానాయకుడు సుహాస్ పుట్టినరోజు సందర్భంగా.. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'నా ఫేవరెట్ నా పెళ్ళాం'"ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు మాట్లాడుతూ "ఇది చాలా మంచి సందేశంతో నిండిన కథ. పిల్లల్ని కనాలంటే చేతినిండా డబ్బులుండాలి.. పిల్లలకు బెస్ట్ ఇవ్వలేనప్పుడు వారిని కనకూడదు అని ఆలోచించే మనస్తత్వం ఉన్న మధ్యతరగతి వ్యక్తి క్యారెక్టర్‌లో సుహాస్ నటించారు. చాలా రోజుల తర్వాత ఓ మంచి చిత్రం చూశామనే సంతృప్తి ఈ సినిమాతో కలుగుతుంది" అని చెప్పారు. "ఇది నా జీవితంలో మరిచిపోలేని సినిమా అవుతుందనే నమ్మకం ఉంది. ఈ పాటకు విజయ్ బుల్గానిన్ వినసొంపైన సంగీతాన్ని.. కృష్ణకాంత్ ఆకట్టుకునే సాహిత్యాన్ని ఇచ్చారు" అని సుహాస్ అన్నారు. సెప్టెంబరు 7న వినాయక చవితి సందర్భంగా ఈ సినిమా విడుదలవుతోంది.



ఒకే రోజు.. రెండు చిత్రాలు!

సాధారణంగా ఒక హీరో నటించిన రెండు సినిమాలు, ఒక దర్శకుడు తెరకెక్కించిన రెండు సినిమాలూ ఒకే రోజు విడుదలైన సందర్భాలూ ఉన్నాయి. ఇప్పుడు రష్మిక మందన్న విషయంలో ఆలాంటి పరిస్థితే రిపీట్ అవుతోంది. ఆమె కథానాయిక పాత్రను పోషిస్తున్న 'పుష్ప 2' సినిమా డిసెంబరు 6న విడుదల అవుతోన్న సంగతి తెలిసిందే. అలాగే అదే రోజున రష్మిక నటిస్తున్న మరో చిత్రం 'ఛావా' కూడా విడుదలవుతుండటం ఆసక్తిని కలిగిస్తోంది. విక్కీ కౌశల్ కథానాయకుడిగా లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోందీ చిత్రం. 'పుష్ప' చిత్రం ఉత్తరాదిలో కూడా పెద్ద హిట్ కావడంతో 'పుష్ప2' కోసం అక్కడి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ సినిమా విడుదలయ్యే రోజే 'ఛావా' చిత్రం కూడా విడుదలవుతుందని మేకర్స్ ప్రకటించారు. నిజంగానే ఈ పోటీ ఉంటుందా లేక 'ఛావా' వెనక్కి వెళుతుందా అనేది వేచి చూడాలి

'రాఖీ' స్పెషల్

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ అందరికీ ప్రత్యేకమయితే.. సినిమా తారలకి మరింత ప్రత్యేకం. ఈ ఏడాది కొందరు తారలు వారి సోదరులతో తీసుకున్న ఫొటోలను.. మరి కొందరు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ త్రోబ్యాక్ పిక్స్‌ను సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ఈ ఫొటోలను చూసిన అభిమానులు 'బ్రదర్ సిస్టర్ బాండింగ్' అంటే ఇదేనంటూ తెగ మురిసిపోతున్నారు.



అందరికీ పేరుపేరునా..

"అందరికీ పేరుపేరునా 'రాఖీ పౌర్ణమి' శుభాకాంక్షలు" అని హీరో వరుణ్ తేజ్ తన సోదరీమణులు నిహారిక, సుష్మితతో కలసి తీసుకున్న ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



నా మార్గదర్శకురాలికి..

అక్కా.. 'రాఖీ పౌర్ణమి' శుభాకాంక్షలు. నా మార్గదర్శకురాలిగా.. సపోర్ట్ సిస్టమ్‌గా ఉన్నందుకు కృతజ్ఞతలు" అని హీరో సుధీర్‌బాబు తన సోదరితో ఉన్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు.



'హ్యాపీ రక్షా బంధన్'

"నా ప్రియ సోదరి మౌని కుట్టీకి.. నన్ను సొంత తోబుట్టువులా భావించే అభిమానులందరికీ 'హ్యాపీ రక్షా బంధన్' అని హీరో సందీప్ కిషన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.



"ఒకరినొకరు ఎల్లప్పుడూ ఇలాగే కాపాడుకుంటూ ఉండాలి" అంటూ తన సోదరుడికి రాఖీని కడుతూ నభా నటేశ్ ఓ వీడియోను అభిమానులతో పంచుకున్నారు.



ఇష్టమైన సమయం వచ్చేసింది

"ప్రతీ ఏడాది.. ఈ రోజు ఎంతో ప్రత్యేకం.. మరెంతో ఇష్టం. ఎందుకంటే ఈ రోజు నువ్వు నా కోసం నచ్చిన బహుమతులు తెస్తావు.. నన్ను కాపాడుతానని ప్రేమతో వాగ్దానాలు చేస్తావు.. నేను చెప్పే ప్రతీది వింటావు" అని రకుల్‌ప్రీత్ సింగ్ తన సోదరుడు అమన్‌ప్రీత్ సింగ్‌కు రాఖీ కడుతున్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.



థ్యాంక్యూ అన్నయ్యా..

"థాంక్యూ అన్నయ్యా.. నా బిగ్ బ్రదర్‌గా ఉన్నందుకు" అని మహేశ్‌బాబు కుమార్తె సితార ఘట్టమనేని, తన సోదరుడు గౌతమ్‌తో దిగిన చిన్ననాటి ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.



నిన్ను బాగా మిస్సవుతున్నాను

"నా బెస్ట్ బ్రదర్‌కి 'హ్యాపీ రక్షా బంధన్'. మనం చిన్నప్పుడు కలసి చేసిన అల్లరినీ.. నిన్నూ ఎంతో మిస్సవుతున్నాను. త్వరలోనే కలుద్దాం" అని హీరోయిన్ తమన్నా భాటియా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేశారు.

వీరితో పాటు అక్షయ్‌కుమార్, సంజయ్‌దత్, సోనూసూద్, సన్నీ డియోల్, కంగనా రనౌత్, పరిణీతీ చోప్రా, భూమి పడ్నేకర్, మనీషా కోయిరాల, రియా చక్రవర్తి, హ్యూమా ఖురేషీ, సారాఅలీ ఖాన్, జెనీలియా దేశ్‌ముఖ్, సోనమ్ కపూర్, కూడా రాఖీ పౌర్ణిమను సెలబ్రేట్ చేసుకుంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

'తల్వార్' ఆకాశ్ జగన్నాథ్



దర్శకుడు పూరి జగన్నాథ్ తనయుడు ఆకాశ్ జగన్నాథ్ కొత్త చిత్రం 'తల్వార్' షూటింగ్ సోమవారం ఉదయం ప్రారంభమైంది. కొత్త దర్శకుడు కాశీ పరశురామ్‌ని పరిచయం చేస్తూ భాస్కర్ ఇ.ఎల్.వి. నిర్మిస్తున్నారు. ఆకాశ్‌పై చిత్రీకరించిన తొలి షాట్‌కు దర్శకుడు బాబీ కెమెరా స్విచాన్ చేయగా, రచయిత విజయేంద్రప్రసాద్ క్లాప్ ఇచ్చారు. మరో దర్శకుడు సానా బుచ్చిబాబు తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో నటించే ఇతర నటీనటుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాత చెప్పారు.

కశ్మీర్‌కు 'ఎనిమిది వసంతాలు'



'మ్యాడ్' చిత్రంలో నటించి గుర్తింపు పొందిన అవంతిక ప్రధాన పాత్ర పోషిస్తున్న 'ఎనిమిది వసంతాలు' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ యర్నేని, రవిశంకర్ నిర్మిస్తున్నారు. భారీ చిత్రాలనే కాదు కంటెంట్ ఉన్న చిన్న చిత్రాలను కూడా ప్రేక్షకులకు ఆశయంతో వారు ఈ సినిమా తీస్తున్నారు. 'ఎనిమిది వసంతాలు' చిత్రం తదుపరి షెడ్యూల్ కశ్మీర్, ఆగ్రా, వారణాసి ప్రాంతాల్లో జరుగుతుంది.

సెలబ్రిటీ నీకన్న ఎవడురా



సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గోట్(గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్). దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ స్టేజ్‌లో ఉన్న ఈ చిత్రం నుంచి హీరో ఇంట్రడక్షన్ సాంగ్‌ను విడుదల చేశారు. 'బాసే హే నీలా ఉండే లక్కు మాకే లేదురా.. సెలబ్రిటీ నీకన్న ఎవడురా' అంటూ కాసర్ల శ్యామ్ రాసిన పాట ఇది. 'పుష్ప 2'లో టైటిల్ సాంగ్ పాడిన దీపక్ బ్లూ ఈ పాట పాడడం విశేషం. 'ఇప్పటివరకూ ఎనభై శాతం చిత్రం పూర్తయింది. యాక్షన్ ఎపిసోడ్స్, రెండు పాటలు మిగిలి ఉన్నాయి. వాటిని కూడా త్వరలో చిత్రీకరిస్తాం' అని నిర్మాత చెప్పారు.

హీరో కృష్ణ అభిమాని సినిమా



కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటిస్తున్న 'జ్యూవెల్ థీఫ్' చిత్రం టీజర్ నటుడు పృథ్వీ విడుదల చేశారు. 'నేను హీరో కృష్ణగారి అభిమానిని. ఆయన స్ఫూర్తితోనే సినిమాల్లోకి వచ్చా. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్' అని చెప్పారు కృష్ణసాయి. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాత మల్లెల ప్రభాకర్ చెప్పారు.

సమస్యలపై 129 వినతులు

● భూ సంబంధిత విన్నపాలే అధికం

● స్వీకరించిన కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్, ఆగస్టు 19: కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో సోమవారం వివిధ సమస్యలపై 129 వినతులు వచ్చాయి. వీటిల్లో ఎక్కువగా భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చాయి. వచ్చిన వినతులను కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, డీఆర్‌వో అనిత స్వీకరించారు. భూ సమస్యలకు సంబంధించి 90, పింఛన్లు మంజూరు చేయాలంటూ 9, మున్సిపాల్టీకి 9, పంచాయతీ శాఖకు సంబంధించి 6 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినతుల పరిష్కారం కోసం సీఎం కార్యాలయం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖల నుంచి సిబ్బందిని ఒక్కొక్కరు చొప్పున ఈ కమాండ్ కంట్రోల్ రూంను డెప్యూట్ చేయాలని ఆదేశించారు. సీఎంవో నుంచి కలెక్టరేట్‌కు వచ్చే వినతులను సంబంధిత అధికారులకు పంపిస్తామని తెలిపారు. అర్జీదారుతో మాట్లాడి, అర్జీదారు సంతృప్తి చెందిన తర్వాతనే వారి ఫొటోతో పాటు సమాధానాన్ని అప్లోడ్ చేయాలని కలెక్టరేట్ ఆదేశించారు. ఖచ్చితమైన, నాణ్యమైన సమాధానాలు ఉండాలని, రీ ఓపెన్ చేసే పరిస్థితి లేకుండా చూడాలని తెలిపారు. వినతులు వచ్చిన రోజే అధికారులు ఓపెన్ చేయాలని, ఈ రోజు ఓపెన్ 8 వినతులు ఉన్నాయని, సాయంత్రానికి అవి జీరో కావాలని తెలిపారు. వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని తెలిపారు. రెవెన్యూ సమస్యలపై ఎక్కువగా వినతులు వస్తున్నాయని వీటిపై తహసీల్దార్లు ఈ విషయంపై జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు.

వసతి గృహ సమస్యలు పరిష్కరించాలి

పట్టణంలోని వసతి గృహాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలి. పట్టణంలోని చాలా వసతి గృహాల్లో భవనాల సమస్యతోపాటు తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం లేదు. కిటికీలు, గోడలు దెబ్బతిన్నాయి. ఐదు సంవత్సరాలుగా భవనాలకు పర్యవేక్షణ ఖర్చులు మంజూరు చేయలేదు. విద్యార్థులు దీని వల్ల చాలా ఇబ్బంది పడుతున్నారు. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలంటూ విజయనగరం నియోజకవర్గం టీడీపీ నాయకులు ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో విన్నవించకున్నారు. కార్యక్రమంలో ఐవీపీ రాజుతోపాటు టీడీపీ నాయకులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

బొండపల్లి, ఆగస్టు 19: అక్రమంగా ఒడిసా నుంచి విశాఖపట్టణం గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పట్టుకుని అరెస్టు చేసినట్టు గజపతినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేఖర్లతో మాట్లాడారు. ఒడిసా రాష్ట్రం సుంకి నుంచి కేజిన్నర గంజాయి తరలిస్తున్న బావాడ పవన్‌కుమార్‌ను, గంజాయి సరఫరా చేస్తున్న సుంకికి చెందిన సుంకరి సూరిబాబును నెలివాడ జంక్షన్ వద్ద స్థానిక ఎస్ఐ కే.లక్ష్మణరావు, సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నామని తెలిపారు. బొండపల్లి మండలం కెరటాం గ్రామానికి చెందిన పవన్‌కుమార్ విశాఖ జిల్లా కొమ్మాదిలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో వార్డు బాయ్‌గా పనిచేస్తున్నాడు. నిందితుడిని విచారించగా మరో 3 పేర్లు వెల్లడించాడని, త్వరలో వారిని పట్టుకుని తెలియజేస్తామన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలు.. పాడి గేదె మృతి

విజయనగరం టౌన్: మండలంలోని కొండకరకాం గ్రామ సమీపంలో ఆర్ టౌన్ షిప్ వద్ద విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. రెండు రోజుల క్రితం విద్యుత్ స్తంభాలకు ఉన్న తీగలు తెగిపడ్డాయి. దీంతో స్థానికులు విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించినా, వారు స్పందించలేదు. దీంతో అటుగా మేతకు వెళ్లిన గేదెల్లో ఒకటి విద్యుత్ షాక్‌కు గురై, అక్కడికక్కడే మృతి చెందింది. రూ.లక్ష విలువ చేసే గేదె మృతితో యాజమానులు లబోదిబోమంటున్నారు.

నేటి నుంచి ఇంటింటి సర్వే

లక్కవరపుకోట: మండలంలో మంగళవారం నుంచి ఇంటింట ఓటరు సర్వే చేపట్టాలని తహసీల్దార్ బీఎల్‌వోలను ఆదేశించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 20 నుంచి అక్టోబరు 18 వరకు ఇంటింటి సర్వే చేసి 2025 జనవరి 6న తుది పబ్లిష్ అయ్యేవరకు చేట్టాలని, ప్రక్రియపై బీఎల్‌వోలకు సోమవారం శిక్షణ అందజేశారు. కొత్త ఓటర్ల నమోదు, మరణాల, ట్రాన్స్‌ఫర్ ఓటర్ల నమోదు క్షుణ్ణంగా చేపట్టాలని తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై యుద్ధం

లక్కవరపుకోట: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా పశు వ్యాధులపై యుద్ధానికి సిద్ధమవుతున్నట్టు మండల పశువైద్యాధికారి కే.గాయత్రి తెలిపారు. పశువుల్లో వచ్చు ప్రాణాంతకమైన బ్రూసెల్లోసిస్, గాలికుంటు వ్యాధులకు టీకా ద్వారా సమాధానం చెప్పాల్సిన అవసరముందని తెలిపారు. ఈ నెల 20 నుంచి వచ్చేనెల 18 వరకు వైద్య క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పునస్సమీక్షించాలి

బొబ్బిలి రూరల్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునస్సమీక్షించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా బంద్ పిలుపునిచ్చినట్టు నియోజకవర్గ మాల సంఘాల అధ్యక్షుడు సోరు సాంబయ్య తెలిపారు. ఈ బంద్‌ను విజయవంతం చేయాలని సంఘాల సభ్యులకు పిలుపునిచ్చారు.

హామీలు నెరవేర్చాలి

బొబ్బిలి రూరల్: ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదర్ డిమాండ్ చేశారు. బొబ్బిలిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. యువతకు నిరుద్యోగ భృతి అమలుపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయానికి పుస్తకాలు

శృంగవరపుకోట: శృంగవరపుకోట శాఖా గ్రంథాలయానికి సోమవారం రైల్వే ఉద్యోగి మోపాడ మోహన్ రూ.3వేలు విలువ చేసే పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందించారు. గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ ఉన్నారు.

బైపాస్ రోడ్డు వెడల్పు తగ్గించాలి

శృంగవరపుకోట: పెందుర్తి నుంచి నిర్మించనున్న రోడ్డు వెడల్పును తగ్గించాలని ఏపీ రైతు సంఘం కోరింది. ఈమేరకు సోమవారం శృంగవరపుకోట తహసీల్దార్ ఎం.అరుణకుమారికి వినతిపత్రం అందించారు. నాయకులు దేగల అప్పలరాజు, కండిపల్లి దేముడు ఉన్నారు.

పైడితల్లినాయుడు ఆశయాలను నెరవేర్చాలి

విజయనగరం దాసన్నపేట: ఉత్తరాంధ్రలో తూర్పుకాపుల అభివృద్ధికి కృషి చేసిన మాజీ ఎంపీ డాక్టర్ కొండపల్లి పైడితల్లినాయుడు ఆశయాలను నెరవేర్చాలని ఆ సామాజిక వేదిక ప్రతినిధి మజ్జి అప్పారావు అన్నారు. పైడితల్లినాయుడు వర్ధంతిని తూర్పుకాపు సామాజిక వేదిక భవనంలో సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అంబళ్ల అప్పలనాయుడు, పి.సూర్యనారాయణ, పి.రామారావు, నాగభూషణం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కళావేదిక ప్రారంభం

జామి: విజినిగిరి గ్రామంలో కళావేదికను స్థానిక పెద్దలు సోమవారం ప్రారంభించారు. వేదిక నిర్మాణానికి రూ.1.70 లక్షలు విరాళం ఇచ్చిన స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ గౌరవ అధ్యక్షుడు కొవ్వాడ చంద్రశేఖర్, సర్పంచ్ కిలారి సూర్యారావు కుటుంబ సభ్యులను సత్కరించారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

బొబ్బిలి రూరల్: శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ జూనియర్స్ టోర్నమెంట్‌లో పారాది జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. బాలురు, బాలికలు రెండు విభాగాల్లోనూ విజయనగరం జిల్లా ప్రధాన స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇందులో పారాది ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆరుగురు ఉన్నారు. వీరిని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బేబీనాయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సుంకరి సాయిరమేష్, పీడీ నల్ల వెంకటనాయుడు, హెచ్ఎం నాగేశ్వరరావు, ఎనిగింటి విజయ్, చొక్కాపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చక్రాల కుర్చీ వితరణ

కొత్తవలస: కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి రెండు కాళ్లు పోగొట్టుకున్న గొల్లాపు పెంటయ్య అనే వృద్ధుడికి సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్టు తరఫున సోమవారం చక్రాల కుర్చీని అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సునీత, విజయలక్ష్మి, పి.శివరామకృష్ణ, గ్రామపెద్దలు గొరపల్లి అప్పలస్వామి, గాలి అప్పారావు, కె.సూర్యనూకరాజు, కర్రి చిన్న, కోకొండ దినేష్, గొలజాపు శివ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోలతో సమావేశం

జామి: మండలంలో ఉన్న బీఎల్‌వోలతో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ, తహసీల్దారు కృష్ణలత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఇంటింట ఓటరు సర్వే అంశంపై వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ నారాయణమ్మ, ఉప తహసీల్దార్ సునీత తదితరులు పాల్గొన్నారు.

రక్షా బంధన్‌తో చెట్లను రక్షిద్దాం

బొబ్బిలి రూరల్: రక్షాబంధన్ స్ఫూర్తితో చెట్లను రక్షిద్దామని మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి పిలుపునిచ్చారు. బొబ్బిలి గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్వీ రమణమూర్తి సోమవారం మున్సిపల్ కమిషనర్‌తో కలసి కార్యాలయ ఆవరణలో ఉన్న బాదం చెట్టుకు హరిత రక్షాబంధన్ కట్టించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ మోహనరావు, మున్సిపల్ కార్యాలయ మేనేజర్ బియ్యం శివప్రసాదు, ఆర్వో ప్రసాదరావు, టీపీఓ వరప్రసాద్, ఏఈ రవికుమార్, జేఏఓ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సానుకూలంగా స్పందించండి

● ఎస్పీ వకుల్ జిందాల్



విజయనగరం క్రైం: బాధితుల సమస్యలపై సానుకూలంగా స్పందించి.. చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారు లను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరం లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి 31 ఫిర్యాదులను స్వీకరించారు. భూ తగదాలకు సంబంధించినవి 14 ఫిర్యాదులు అందాయని, కుటుంబ కలహాలకు సంబంధించి 4, మోసాలకు పాల్పడినట్టుగా 6, ఇతర విషయాలకు సంబంధించినవి 7 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. అధికారులు ఏడు రోజుల్లో వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏఎస్పీ ఆస్మాపరహీన్, డీఎస్పీ గోవిందరావు, సీఐలు విజయనాథ్, నర్సింహమూర్తి, ఎస్ఐ గణేష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

వైద్యులు బాధ్యతగా పని చేయాలి

● ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట: వైద్యులు బాగా పనిచేసినప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. సోమవారం శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రస్తుతం నిధుల కొరతను ఎదుర్కొంటున్నందున అంచలంచలుగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తానన్నారు. ఆసుపత్రి ప్రహరీ నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధుల కేటాయింపుకు ప్రతిపాదనలు చేస్తానన్నారు. రక్తదాన శిబిరం ద్వారా ఆసుపత్రిలో రక్తనిల్వలు ఉండేలా చేద్దామని మాటిచ్చారు. ఈ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సదుపాయం టీడీపీ కల్పించిందన్నారు. ప్రాంతీయ ఆసుపత్రి స్థాయిని ను కూడడ పెంచిందన్నారు. వైసీపీ అధికారం చేపట్టిన తరువాత ఈ ఆసుపత్రిను పట్టించుకోకపోవడంతో అనేక సమస్యలు వేదిస్తున్నాయన్నారు. వీటిని తప్పక సరిదిద్దుతానన్నారు. అత్యవసర చికిత్స అవసరమగు రోగులను నేరుగా కేజీహెచ్‌కు తరలించాలని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖా మంత్రిని కోరినట్లు తెలిపారు. అంతకుముందు ఆసుపత్రిలో రోగులను పలకరించారు. ఆసుపత్రి సేవలపై ఆరా తీశారు. సూపరింటెండెంట్ ఎ.నీల, రిటైర్డ్ సూపరింటెండెంట్ ఆర్.శ్రీనాథరావు, మండల టీడీపీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, కాపుగంటి వాసు, కిలపర్తి జగదీష్, వైద్యులు, సిబ్బంది, ఏపీఎంఎస్ఐడీసీ అధికారులున్నారు.



ఆసుపత్రి అభివృద్ధి సమావేశంలో మాట్లాడుతున్న కోళ్ల

క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం

● రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు సహకారం

● కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

● ముగిసిన అంతర్ జిల్లా సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 19: 'క్రీడాకారులను మరింత ప్రోత్సహించేలా జిల్లాలో అన్ని క్రీడాంశాల్లోనూ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించాలి. అందుకు తగ్గ సహకారం అందిస్తామ'ని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న 11వ అంతర్ జిల్లా సాఫ్ట్‌బాల్ టోర్నమెంటు సోమవారం ముగిసింది. విజేతలను కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అభినందిస్తూ.. ట్రోఫీకప్‌లను అందజేశారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ.. 'క్రీడలతో జిల్లాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఏ క్రీడంశాల్లోనైనా జిల్లావాసులు ఇట్టే రాణించగలరు. ఆరోగ్యకరమైన వాతావరణానికి క్రీడలు ఎంతో దోహదపడతాయి. 2028లో రాష్ట్రంలో జాతీయ క్రీడలు నిర్వహిస్తాం. క్రీడాకారులకు రైల్వేశాఖ ఇచ్చిన 75శాతం రాయితీ.. పునరుద్ధరణకు కృషి చేస్తా'నని తెలిపారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కోడిరామ్మూర్తి స్టేడియం పునర్నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ముఖ్యసలహాదారు పి.సుందరరావు, ఎస్టీఎఫ్ కార్యదర్శి బివి.రమణ, సాఫ్ట్‌బాల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.వి.రమణ, ప్రతినిధులు కలిదిండి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



బాలికల విభాగంలో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్న విజయనగరం జట్టు

● అంతర్ జిల్లా సాఫ్ట్‌బాల్ టోర్నమెంటులో బాలుర విభాగంలో విజయనగరం జట్టు ప్రథమ, శ్రీకాకుళం జట్టు ద్వితీయ, అనంతపురం జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో విజయనగరం జట్టు ప్రథమ, గుంటూరు జట్టు ద్వితీయ, శ్రీకాకుళం జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి.

వైకుంఠ నారాయణునికి పంచామృతాభిషేకాలు



విజయనగరం రింగు రోడ్డు, ఆగస్టు 19: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో సోమవారం వైకుంఠ నారాయణ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయ అర్చకులు చాణక్య, శ్రీహర్ష, తేజల ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ నారాయణ స్వామికి పంచామృతాభిషేకాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవంలో ఎన్‌సీఎస్ ట్రస్టు సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, పీఆర్ఓ రమణ పాల్గొన్నారు.

ముగిసిన తైక్వాండో పోటీలు

విజయనగరం టౌన్: జిల్లా తైక్వాండో అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. జిల్లా కేంద్రంలోని రాజీవ్ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో విజేతలకు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ సీహెచ్ వేణుగోపాలరావులు ట్రోఫీలను అందజేశారు. తూర్పుగోదావరి, విశాఖపట్టణం జిల్లా జట్లు తొలి రెండు స్థానాలు సాధించాయి. మూడో స్థానంలో కడప జట్టు నిలిచింది. ఈ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఆగ్రాలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

కోల్‌కత్తా ఘటనపై నిరసన



గాంధీబొమ్మ ముందు ఏపీటీఎఫ్ నాయకులు నిరసన తెలుపుతున్న దృశ్యం

బొబ్బిలి: కోల్‌కత్తాలో మానవ మృగాలకు బలైపోయిన ట్రైనీ డాక్టర్ ఆత్మకు శాంతి చేకూరాలని... నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ.. స్థానిక గాంధీ విగ్రహం ముందు సోమవారం సాయంత్రం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఏపీటీఎఫ్ నేతలు జేసీ రాజు, బంకురు జోగినాయుడు మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌పై అఘాయిత్యానికి పాల్పడిన వారిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పక్కా ప్రణాళికను అమలు చేయాలని... లేకుంటే మహిళలకు భద్రత లేకుండా పోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళిక

కలెక్టరేట్: జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అంబేద్కర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవకాశాలను పెంచడంతో పాటు, అవరోధాలను తొలగించడానికి కృషి చేస్తామన్నారు. పరిశ్రమల స్థాపనకు వచ్చే దరఖాస్తులు నిర్ణీత గడువులోగా సింగిల్ విండో పద్ధతిలో ఆమోదిస్తామని ప్రకటించారు. జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ జిల్లాలోని వనరులు, పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అందుకు అనువైన పరిశ్రమలను స్థాపించే విధంగా పారిశ్రామికవేత్తలు ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ డీడీ నాగేశ్వరరావు, సీపీవో బాలాజీ, ఏపీఐఐసీ ఏఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లాలో చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అంబేద్కర్ ఆదేశించారు. చేనేత జౌళి శాఖ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన టెక్స్‌టైల్ పాలసీని రూపొందించనున్నదని, దీని కోసం అవసరమైన ప్రతిపాదనలను పంపించాలని చెప్పారు. జిల్లాలోని మొత్తం 23 చేనేత సహకార సంఘాల్లో సుమారు 2,500 మంది కార్మికులుగా ఉన్నారని, వీరిలో కేవలం 9 మంది మాత్రమే ప్రస్తుతం చురుకైన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. జిల్లాలోని మొత్తం చేనేత కార్మికులందరూ వృత్తిని అవలంబించే విధంగా, వారు ఆర్థికాభివృద్ధి సాధించేలా సమగ్ర ప్రణాళికను ప్రభుత్వానికి పంపించాలని కలెక్టర్ సూచించారు.

26 నుంచి కృష్ణజన్మాష్టమి వేడుకలు

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 19: ఈ నెల 26 నుంచి 30 వరకూ ఆచార్య ప్రబోదానంద యోగీశ్వరుల ఆశీస్సులతో త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ప్రబోదా సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక జిల్లా శాఖ అధ్యక్షులు వి శంకరరావు అన్నారు.. సోమవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని కలిసి అహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 26 నుంచి 30 వరకూ గురజాడ కళాభారతి గ్రౌండ్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు గజపతినగరం, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాంలో కూడా ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రభోదాసేవా సమితి ప్రతినిధులు సీవీఎస్ నాయుడు, ప్రసాద్, ఆదినారాయణ, శ్రీను, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలపై అవగాహన సదస్సు

విజయనగరం రింగురోడ్డు: మహారాజా స్వయం ప్రతిపత్తి కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం అణు సాంకేతికత- పరిశోధనలు అనే అంశంపై ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు విశాఖపట్టణంలోని గీతం విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ హరి ఎస్. మిశ్రా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టు గ్రాడ్యుయేషన్, ఎంటెక్ పూర్తి చేసిన వారిని అణుశక్తి విభాగంలో సైంటిఫిక్ ఆఫీసర్లుగా నియమించే అవకాశం ఉంటుందని తెలిపారు. పోస్టుగ్రాడ్యుయేషన్ విద్యార్థులు ఇండోర్‌లో గల ఆర్ఆర్‌సీఏటీ, కోల్‌కత్తాలో గల వీఈసీసీ, హైదరాబాద్‌లో ని భద్రుఘర్‌లో పరిశోధనలు చేయవచ్చునని వెల్లడించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలోని డీసీఏ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మహిళలు, పురుషుల బ్యాడ్మింటన్ పోటీలు సోమవారంతో ముగిశాయి. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పురుషుల సింగిల్స్‌కు 48 మంది, డబుల్స్‌లో 24 జట్లు, మహిళల డబుల్స్‌లో 17 జట్లు, మిక్స్‌డ్ డబుల్స్‌లో 40 జట్లు పాల్గొన్నాయి. మహిళల సింగిల్స్‌లో 40 మంది పాల్గొన్నారు. సోమవారం ముగిసిన తుది పోటీల్లో మహిళల సింగిల్స్‌లో కృష్ణా జిల్లాకు చెందిన పి సూర్య చరిష్మా, చిత్తూరుకు చెందిన నవ్య కండేరీ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. పురుషుల సింగిల్స్‌లో విశాఖపట్టణానికి చెందిన బాల ప్రణయ్ ప్రగడ, తూర్పు గోదావరికి చెందిన భార్గవ శ్రీరామ్ మొదటి రెండు స్థానాలు సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో భార్గవరామ్ (గుంటూరు), రక్షిత (కృష్ణా) విజేతలుగా నిలిచారు. ఎ.వంశీకృష్ణ రాజ్ (పశ్చిమగోదావరి), టి.సూర్య చరిష్మా (కృష్ణా) రెండో స్థానంలో నిలిచారు. మహిళల డబుల్స్‌లో ఆకాంక్ష (ప్రకాశం), ఎల్.మాణిక్య (కృష్ణా) విజేతలుగా, స్రవంతి, దీపిక (గుంటూరు) రెండో స్థానంలో నిలిచారు. పురుషుల డబుల్స్ విభాగంలో భార్గవ్‌రామ్ (గుంటూరు), విశ్వతేజ్ (తూర్పుగోదావరి) విజేతలుగా నిలవగా, కె.శ్రీమోహిత్ (తూర్పుగోదావరి), షేక్ నుమేయర్ (ప్రకాశం) ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, రఘురాజు ట్రోఫీలను అందజేశారు.



హోరాహోరీగా జరుగుతున్న పురుషుల డబుల్స్ పోటీలు

బొబ్బిలిలో ఆటో బోల్తా

● రహదారి గుంతల్లో దిగబడి ప్రమాదం

● మహిళలు, చిన్నారులకు గాయాలు



గోతిలో ఆటోను ఎత్తుతున్న స్థానికులు, క్షతగాత్రులను బయటకు తీస్తున్న దృశ్యం

బొబ్బిలి: తెర్లాం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో పూల్‌బాగ్ జంక్షన్ వద్ద పెద్దగుంత ఏర్పడడంతో సోమవారం మధ్యాహ్నం ఓ ఆటో అందులో బోల్తా పడింది. అందులో ఉన్న చిన్నారులు, మహిళలు, వృద్ధులు బురదనీటిలో పూర్తిగా పడిపోయారు. స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకొని అందరినీ బయటకు తీశారు. స్వల్పంగా గాయపడడంతో వారిని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బోల్తా పడిన ఆటోను అక్కడి నుంచి తరలించారు. రోడ్డు బాగు చేయకుండా తాత్సారం చేస్తున్న అధికారుల తీరుపై ప్రయాణికులు దుమ్మెత్తి పోశారు. పట్టణ పరిసరాల్లో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ నెల 1న అమ్మిగారి కోనేరు రోడ్డులో జరిగిన ప్రమాదంలో 12 ఏళ్ల విద్యార్థి దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. అలజంగి రోడ్డులో ఆదివారం రాత్రి ఓ లారీ బోల్తా పడింది. ఇలా తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా.. పూల్‌బాగ్ ప్రాంతంలో ఆటో బోల్తాపడిన సంగతి తమకు తెలియదని పోలీసులు చెబుతున్నారు. పోలీసుస్టేషన్‌కు ఎవరూ సమాచారం ఇవ్వలేదని అంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

డెంకాడ, ఆగస్టు 19: అమకాం బస్‌స్టాప్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భోగాపురం మండలం ముంజేరు గ్రామానికి చెందిన పి రాము (25) మృతి చెందినట్లు డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. భోగాపురం మండలం ముంజేరు గ్రామానికి చెందిన పి రాము, అదే మండలంలో గల సన్‌రే ప్రయివేటు రిసార్ట్‌లో కాంట్రాక్టు లేబర్ సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం రాత్రి, భోగాపురం నుండి 10.30 గంటలకు విజయనగరం వెళ్ళే సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానికులు తెలిపిన సమాచారంతో ఘటనా స్థలం చేరుకుని మృతదేహాన్ని గుర్తించి పోస్టు మార్టం నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు.

బంగారం చోరీ

డెంకాడ: ఓ ఇంట్లో బంగారం చోరీ జరిగిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని డెంకాడ గ్రామానికి చెందిన నాలి నారాయణరావు ఇంట్లోని బీరువాలో ఉన్న సుమారు 21 తులాల బంగారు ఆభరణాలు దొంగతనానికి గురయ్యాయి. గుర్తించిన వెంటనే బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసి సీఐ రామకృష్ణ సిబ్బందితో దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

రైతులకు హమాలీ చార్జీలు

జామి/ ఎల్‌కోట: మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు పోరాటం ఫలించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు సమయంలో 2021-22 సంవత్సరానికి గాను అన్నంరాజుపేట సహకార సొసైటీ, జామి మండల కేంద్రంలో ఉన్న సహకార సంఘం ద్వారా రూ.20 లక్షల వరకు రైతులకు చెల్లించాల్సిన హమాలీ చార్జీలు విడుదలైనా ఇవ్వకుండా ఆపేశారు. దీంతో రైతులు మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబును ఆశ్రయించారు. నాటి నుంచి నేటి వరకు మండల స్థాయి నుంచి కలెక్టర్.. సంబంధిత శాఖ రాష్ట్ర స్థాయి కమిషనర్ వరకు అనేకసార్లు కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. కానీ ఫలితం కనిపించలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గజపతినగరం ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి కొండపల్లి శ్రీనువాస్, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, కలెక్టర్ అంబేద్కర్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్లను పదేపదే కలిశారు. దీంతో 1,251 మంది రైతులకు ఇవ్వాల్సిన హమాలీ చార్జీలు రూ.20 లక్షలు విడుదలయ్యాయి. ఈ మొత్తాన్ని మాజీ జడ్పీటీసీ పెదబాబు సోమవారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారితో రైతులకు ఇప్పించారు. అనంతరం లలితకుమారి మాట్లాడుతూ హమాలీ చార్జీలు ఇప్పించేందుకు పెదబాబు ఎంతగానో పోరాటం చేసి విజయం సాధించారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, జామి మండల నాయకులు, మండల రైతులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు: ఎస్పీ

విజయనగరం క్రైం: తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. సోమవారం పద్మావతి నగర్‌లోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడ్డ మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏటా సుమారు 2 లక్షల 50 వేల మంది రహదారి ప్రమాదాల్లో మరణిస్తున్నారని, మరో 4 లక్షల మంది క్షతగాత్రులు అవుతున్నారని తెలిపారు. రహదారి భద్రతలో భాగంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి ప్రమాదాలను నియంత్రించడమే లక్ష్యమన్నారు. డీఎస్పీ గోవిందరావు, సీఐ సూరినాయుడు, ఎస్ఐ లు లోవరాజు, రవి, మహేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోట ఉప కారాగారం తనిఖీ

శృంగవరపుకోట: శృంగవరపుకోట ఉపకారాగారంను సోమవారం విజయనగరం జిల్లా సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి కె.విజయ తనిఖీ చేసారు. ఖైదీలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. వారి ఆరోగ్యం, అందుతున్న ఆహారం వంటి విషయాలను చూసారు. ఉచిత న్యాయ సేవల గురించి రిమాండ్ ఖైదీలకు వివరించారు.



తనిఖీ చేస్తున్న న్యాయాధికారి విజయ

ఉద్యోగ భద్రత కల్పించాలి

వేపాడ: తమకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేస్తున్న సిబ్బంది కోరారు. మండల కేంద్రం వేపాడ ప్రభుత్వ మద్యం షాపు వద్ద సిబ్బంది ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. మద్యం షా పుల్లో పని చేసే సిబ్బందికి రాజకీయాలతో సంబంధం లేదని... తమ కుటుంబాలే ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోకాడ మహేష్, సేల్స్‌మేన్లు పొట్నూరు శ్రీను, దుడ్డు సింహాచలం, నాయుడు, కిలపర్తి నాయుడు, సెక్యూరిటీ గార్డులు బంగారయ్య, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.



మద్యం షాపు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

అర్జీలను గడువులోగా పరిష్కరించండి



పార్వతీపురంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

● కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అధికారులకు ఆదేశం

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: ప్రజా సమస్యల పరిష్కరవేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అధికారులు బాధ్యతతో పనిచేసి ప్రజల నుంచి వచ్చే వినతులను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ శ్యాంప్రసాద్, జేసీ శోబిక, డీఆర్వో కేశవనాయుడు, పార్వతీపురం ఆర్డీవో హేమలతతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమానికి 132 దరఖాస్తులు అందాయి. వీటి పరిష్కారానికి కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు.

పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణ పూర్తి చేయాలి

పార్వతీపురం రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) కంప్యూటరీకరణ పనులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. సోమవారం సహకార శాఖ కార్యాలయంలో వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కంప్యూటరీకరణ పనులకు సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. పీఏసీఎస్ కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచడం, రుణాలను వేగంగా పంపిణీ చేయడం, లావాదేవీల ఖర్చులను తగ్గించడం, చెల్లింపుల్లో అసమతుల్యతను తగ్గించనున్న ట్లు చెప్పారు. కామన్ అకౌంటింగ్ సిస్టమ్ (సీఏఎస్), మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ అమలు ద్వారా పీఏసీఎస్‌లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రుణాలు పొంద డానికి, రీషెడ్యూల్ పనుల్లో రైతులకు వేగవంతమైన సేవలు అందించవచ్చని కలెక్టర్ చెప్పారు. కార్య క్రమంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి పి.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారుల నిలదీత



ఉపాధి పనుల్లో అక్రమాలపై నిలదీస్తున్న మహిళ

వీరఘట్టం: మండలంలోని నడుకూరులో సోమవారం నిర్వహించిన ఉపాధి హామీ ఆడిట్ సమావేశంలో గ్రామానికి చెందిన వేతనదారులు నిలదీశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వారంరోజులు పనిచేసినా, కొంత మామూలు చెల్లించాలని ఫీల్డ్ అసిస్టెంట్ ఒత్తిడి చేస్తున్నారని, అలా కాని పక్షంలో కూలి మొత్తంలో తగ్గిస్తున్నారని ఆరోపించారు. వంద రోజులు పనిని కల్పించడం లేదని విమర్శించారు. గ్రామాల్లో లేని వారికి కూడా ఉపాధి కూలి చెల్లిస్తున్నారని వాపోయారు.దీంతో ఏపీవో జి.సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి కూలి వివరాలు పంచాయతీ సెక్రటరీకి అందించామని తెలిపారు. గ్రామస్థులు వాటిని పరిశీలించి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రక్తదాన శిబిరం విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న లక్ష్మణనాయుడు

వీరఘట్టం: పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని యువకులు, ప్రభుత్వ ఉద్యోగులు విజయవంతం చేయాలని ఆర్‌ఐ లక్ష్మణనాయుడు కోరారు. సోమవారం వీరఘట్టం జడ్పీ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి ఎంతగానో రక్తం ఉపయోగపడుతుందని తెలిపారు.

జనసేన మండల కమిటీ ఎన్నిక

సీతంపేట రూరల్: జనసేన మండలాధ్యక్షుడిగా ఎం.విశ్వనాథం, ఉపాధ్యక్షులుగా సవర ప్రసాదరావు,కె.శ్రీకాంత్,ఎస్.రాజేష్ ఎన్నికైనట్లు విశ్వనాథం సోమవారం తెలిపారు. ప్రధాన కార్యదర్శులుగా ఎం.సురేష్, ఎం.అరుణ్‌కుమార్, ఎస్.సింహాద్రి, ఎస్.ఉపేంద్ర, కార్యదర్శులుగా రాకేష్, ఎస్.గణేష్, వి.కోటేశ్వరరావు, వి.సురేష్‌లతో పాటు మరి కొందరు ఎన్నికయ్యారని చెప్పారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా నూతన కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సంతోషిమాత ఆలయంలో దీపారాధన

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లిలో గణపతి సుబ్రహ్మణ్యేశ్వర సహిత సంతోషిమాత అమ్మవారి ఆలయంలో సంతోషిమాత అమ్మవారి జన్మదినం పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 1008 దీపాలతో దీపారాధన చేశారు. రాత్రి పాలకొండ భజన బృందంచే భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు, కమిటీ మెంబర్లు, భక్తులు, మహిళలు పూజల్లో పాల్గొన్నారు.

శివాలయాల్లో భక్తుల రద్దీ

సాలూరు రూరల్: శ్రావణ సోమవారం కావడంతో సాలూరులో శివాలయాల్లో భక్తులతో రద్దీ నెలకొంది. భక్తులు వేకువ నుంచే బారులుతీరారు. సాలూరు పంచముఖేశ్వర, ఉమా రామలింగేశ్వర, నగేశ్వరస్వామి, కాశీ విశ్వేశ్వర ఆలయాల్లో భక్తులు అభిషేకాలుచేశారు. రామలింగేశ్వర ఆలయంలో అర్చకస్వామి శివప్రసాద్ శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకాలను నిర్వహించారు.

గుర్రప్పవలసలో వైద్యశిబిరం

సాలూరు రూరల్: మండలంలోని గుర్రప్పవలసలో సోమవారం మామిడిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.శివకుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురు గిరిజనులకు వైద్యతనిఖీలు నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సాయిమురళి తదితరులు పాల్గొన్నారు.

సాలూరు ఏజెన్సీలో భారీ వర్షం

సాలూరు రూరల్: సాలూరు ఏజెన్సీలో సాలూరు, పాచిపెంట మండలాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. మామిడిపల్లి, కూర్మరాజుపేట, కొత్తవలస, బొడ్డవలస, మరిపిల్లిల్లో, పాచిపెంట మండలంలో పణుకువలస,విశ్వనాథపురం, గడివలస, కూనంబందవలస, కొత్తవలస,కోనవలస తదితర గ్రామాల్లో కురిసిన వర్షం ఖరీఫ్‌కు సాగుకు వర్షం ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు. ఏవోబీ కొండల్లో భారీ వర్షం కురవడంతో పలు వాగులు పొంగి ప్రవహించాయి.

సైనిక్ పాఠశాలలో క్రీడా పోటీలు

విజయనగరం టౌన్: కోరుకొండ సైనిక్ స్కూల్‌లో ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ జాతీయ స్థాయి క్రీడా, సాంస్కృతిక మీట్-2024 సోమవారం నుంచి ప్రారంభమయ్యింది. గ్రూప్-ఎఫ్‌లో ఇంట్రా గ్రూప్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్, ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్‌లో జోన్‌కు ప్రాతినిధ్యం వహించే ఉత్తమ జట్లను ఎంపిక చేయనున్నట్టు ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి తెలిపారు. ఈ పోటీలలో అంబికాపూర్, భువనేశ్వర్, సంబల్‌పూర్, కోరుకొండ సైనిక స్కూల్ జట్లకు చెందిన దాదాపు 200 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ నేషనల్స్ గేమ్స్ టార్చ్‌ని వెలిగించి పోటీలను ప్రారంభించారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు మెమో

గజపతినగరం: ఎం.కొత్తవలస గ్రామంలోగల అంగన్‌వాడీ కార్యకర్త పి.రాజేశ్వరికి మెమో జారీ చేసినట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు కేంద్రం తెరిచి పిల్లల సంరక్షణ చూడాల్సిన అంగన్‌వాడీ కార్యకర్త 10 గంటల సమయం వరకు కేంద్రానికి రాక పోవడంతో గ్రామస్థుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు పరిశీలించిన పిమ్మట మెమో జారీ చేశామని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఉదయం 9గంటలకు కేంద్రాలు తెరిచి సాయంత్రం 4గంటల వరకు విధులు నిర్వహించాలని సూచించారు. లేనిఎడల చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామసభల నిర్వహణపై ప్రత్యేక సమావేశం

సంతకవిటి: గ్రామ సభల నిర్వహణపై సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.రఘునాథాచారి మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన మండలంలోగల 34 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలని ఆదేశాలు జారీచేశారు. ఉపాధి హామీ పథకంలో 46 వ్యవసాయ అనుబంధ పనుల జాబితాను తెలియజేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులను గుర్తించి గ్రామసభలో ఆమోదించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.రఘునాథాచారి, ఈవోఆర్డీ ఎల్.పుష్పాంజలి, ఉపాధి హామీ పథకం ఏపీవో హరినాథ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హిందువులపై దాడికి నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న జగన్నాథ ఫోరం సభ్యులు

రాయగడ: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా జగన్నాథ సంస్కృతి పరిరక్షణ ఫోరం సభ్యులు రాయగడ పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లోని ఓ సామాజిక వర్గం హిందువులపై అమానవీయంగా దాడులు చేయడంతోపాటు హిందూ దేవతల ఆలయాలను ధ్వంసం చేయడం, హిందువుల కుటుంబాలకు చెందిన మహిళలు, యువతులపై అత్యాచారాలు చేసి హతమార్చడం క్షమిం చరాని నేరమన్నారు. ప్రధాని మోదీ చర్యలు తీసుకుని ఆ దేశంతో తెగతెంపులు చేసుకోవడంతో పాటు మన దేశంలో వివిధ పట్టణాలు, గ్రామాల్లో నివసిస్తున్న రోహింగ్యా చొరబాటుదారులను బహిష్కరించాలని డిమాండ్‌చేశారు.అనంతరం పలు డిమాండ్లతో కూడుకున్న వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

ఏనుగుల సమస్య పరిష్కరించాలి

● కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి



అటవీశాఖాధికారులతో సమీక్షిస్తున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: నియోజకవర్గంలో ఏనుగుల సమస్యను శాశ్వత పరిష్కారానికి అటవీ అధికారులు ప్రణాళికలు తయారు చేయాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచించారు. సోమవారం గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అటవీ శాఖాధికారులతో సమీక్షించారు. ఏనుగుల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం నమోదుచేయడంలో నిర్లక్ష్యంగా ఉండకూడదని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా డీపట్టాల సమస్య ఉందని, వీటికి అటవీ శాఖ పూర్తిగా సహకరించి రైతులకు పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అటవీ శాఖ డీఎఫ్‌వో ప్రసూన, జీఎంవలస ఎంపీపీ బొంగు సురేష్, టీడీపీ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ చర్యలు తీసుకోండి

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర



మాట్లాడుతున్న విజయచంద్ర

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: గత ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి వ్యతిరేకంగా నియోజకవర్గంలో పనిచేసిన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. సోమవారం పార్వతీపురం పట్టణం, పార్వతీపురం, బలిజిపేట, సీతానగరం మండలాలకు చెందిన నాయకులత కలిసి విశాఖపట్నంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు కలిశారు. గత ఎన్నికల్లో పార్టీని ఓడించేందుకు కొంతమంది నాయకులు చేసిన ప్రయత్నాలను శ్రీనివాసరావుకు వివరించారు. నియోజకవర్గంలో తన విజయం అడ్డుకొనేందుకు చివరి నిమిషం వరకు కొంతమంది నాయకులు ప్రయత్నించారని ఎమ్మెల్యే తెలిపారు.దీంతో ఆయన స్పందించి పార్టీకి వెన్నుపోటు పొడిచిన వారికి ఎటువంటి పదవులు లభించవని తెలిపారు.

చలో కలెక్టరేట్ ఉద్రిక్తత

● *రోడ్డుపై బైఠాయించి శివ్వాం దళితుల ఆందోళన*



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న దళితులు

బెలగాం: గరుగుబిల్లి మండలంలోని శివ్వాం గ్రామ దళితులు సోమవారం నిర్వహించిన చలో కలెక్టరేట్ ఉద్రిక్తంగా మారింది. తమ భూమిని సర్వే చేయించి అప్పగించాలని కలెక్టరేట్ వద్ద 40 రోజులుగా నిరసన దీక్ష చేపట్టిన వారు సోమవారం చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో భూ సమస్యలు పరిష్కరించాలని స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు దళితులు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించారు. అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీస్ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. అనంతరం డీఆర్వో, ఆర్డీవో వచ్చి భూ సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో వారు శాంతించి ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కృష్ణమూర్తి మాట్లాడుతూ ముందుగానే కొంతమంది ప్రజా సంఘాల నాయకులను అక్రమంగా హౌస్ అరెస్ట్ చేశారని ఆరోపించారు. అరెస్ట్‌లతో పోరాటాలను ఆపలేరని హెచ్చరించారు. పేదల భూములు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. వెంటనే శివ్వాంలో సర్వే చేయించి దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు.

సీపీఎం నాయకుడి గృహ నిర్బంధం

గుమ్మలక్ష్మీపురం: అన్యా క్రాంతమైన భూములను వెంటనే దళితులు, గిరిజనులు, పేదప్రజలకు అప్పగించాలని కలెక్టర్ కార్యాలయానికి వెళ్తున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మండంగి రమణను సోమవారం గృహనిర్బంధం చేశారు. ఈసందరంగా ఆయన మాట్లాడుతూ అక్రమ అరెస్టు చేయడం సబబు కాదన్నారు. గృహ నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరన్నారు. శివ్వాం దళితుల సమస్యలతో పాటు బడిదేవరమ్మ కొండ గ్రానైట్ తవ్వకాలు అనుమతులు రద్దు చేయాలన్న సమస్యలపై కలెక్టర్‌కు విన్నవిందామని అనుకున్న సమయంలో గృహ నిర్బంధాలు చేశారన్నారు.

ఇలా కుక్కేసి..

సీతానగరం: సీతానగరంలో పశువుల తరలిస్తున్న వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. సోమవారం హనుమాన్ కూడలిలో ఒడిశా నుంచి విశాఖ పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎటువంటి ఆధారాలు లేకపోవడంతోపాటు ఒకే వ్యాన్‌లో 20 పశువులను తాళ్లతో కట్టి తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.



వ్యాన్‌లో పశువులను కుక్కి తరలిస్తున్న దృశ్యం

ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి: ఎస్పీ



ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే విచారించి పరిష్కరించాలని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం పార్వతీపురంలోని తన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వచ్చిన అర్జీలపై తక్షణమే విచారించి చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏడు ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఆర్‌బీ సీఐ బీఎండీ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఐటీడీఏ ప్రజా గ్రీవెన్స్‌కు 31 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి పీవో

సీతంపేట: ఐటీడీఏ ఎస్ఆర్‌శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్‌కు 31 వినతులు వచ్చినట్టు ఇన్‌చార్జి పీవో వీవీ రమణ తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, ఈఈ సింహాచలం, ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణమూర్తి, పీహెచ్‌వో వెంకట గణేష్, సీడీపీవో రంగలక్ష్మి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



లూయిస్‌డాగురే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఫోటో గ్రాఫర్లు

పాలకొండ: పాలకొండ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెమేరా సృష్టికర్త లూయిస్‌డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫొటో, వీడియో గ్రాఫర్స్ సభ్యులు మాట్లాడుతూ ఎప్పటికీ నిలిచి పోయే జ్ఞాపకమే ఫొటో అన్నారు.

వైద్యురాలి అత్యాచార ఘటనపై నిరసన

సీతంపేట/రూరల్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి అత్యాచార ఘటనపై డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుశాంత్‌జైన్, సిబ్బంది నిరసన తెలిపారు. సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్య క్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడిన దోషులను శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, శంకరరావు పాల్గొన్నారు

సాగు భూములకు పట్టాలివ్వాలి

● *సీపీఐ ఎంఎల్ జిల్లా కమిటీ సభ్యుడు విఠలేశ్వరరావు*



బర్న సీతంపేటలో భూములను పరిశీలిస్తున్న నాయకులు

పాలకొండ: ఏళ్లుగా సాగుచేస్తున్న భూములకు పట్టాలివ్వాలని సీపీఐ (ఎంఎల్) జిల్లా కమిటీ సభ్యుడు ఎన్.విఠలేశ్వరరావు కోరారు.సోమవారం మండలంలోని జంపరకోట పంచాయతీ బర్న సీతంపేట, సీతంపేటగూడ రైతులు సాగు చేస్తున్న భూములను విఠళేశ్వరరావుతో పాటు ఆ పార్టీ నాయకులు బి.గోపాలం, కూరంగి తవిటయ్య, నిమ్మకసత్యం, నిమ్మక ఆదినారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా విఠళేశ్వరరావు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు స్పందించి గిరిజన రైతులకు పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

దశపర్ణి కషాయంతో చీడపీడల నివారణ



కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న అన్నపూర్ణ

జియ్యమ్మవలస: చీడ పీడల నివారణకు దశపర్ణి కషాయం ఎంతగానో ఉపయోగపడు తుందని ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ జి.అన్నపూర్ణ తెలిపారు. సోమవారం మండలంలోని కన్నపుదొరవలస రైతుసేవా కేంద్రం వద్ద రైతులకు దశపర్ణి కషాయం తయారు చేయడంపై వివరించారు. కార్యక్రమంలో వీఏఏ ప్రియాంక, యూనిట్ ఇన్‌చార్జి బి.లత, ఎం.జగదీశ్వరి, ఎం.పార్వతి, నాగమణి, రైతులు వి.అప్పలస్వామి, సింహాచలం, దాలినాయుడు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాల పరిశీలన

కురుపాం రూరల్: కురుపాంలోని కస్తూర్బా విద్యాలయాన్ని సోమవారం మండల న్యాయసేవా కమిటీ ఛైర్మన్ జె.సౌమ్యాజోస్పిన్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న మెనూ, రక్షిత మంచినీరు, సరుకుల లెడ్జర్, సిక్ రూమ్ మరుగుదొడ్లు పరిశీలించారు. విద్యార్థినుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కాలీగ్రాఫీ నందినికి అభినందన

సాలూరు రూరల్: కాలీగ్రాఫీ ఎక్స్‌పర్ట్ కొల్లి నందిని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం అభినందించారు.నందిని తాను చదువుతూ తన తోటివారికి కాలీగ్రాఫీలో శిక్షణనిస్తున్న విషయం ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించిన విషయం విదితమే. ఈమేరకు నందినికి అభినందించారు.

పింఛన్లపై విచారణకు ఆదేశాలు

గరుగుబిల్లి: మండలంలోని బీవీ పురం, దళాయివలస పంచాయతీల పరిధిలో పింఛన్లపై విచారణ నిర్వహించాలని ఎంపీడీవోను డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు ఆదేశించారు. రెండు గ్రామాల పరిధిలో సుమారు 40 మందికి పైగా అనర్హులు పింఛన్లు పొందుతున్నారని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కలెక్టర్‌కు టీడీపీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి నివేదికలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు.దీంతో ఎంపీడీవో జి.పైడితల్లి రెండు పంచాయతీల్లో విచారణకు అవసరమైన సిబ్బందిని నియమించామని సోమవారం తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా రక్షాబంధన్



సాలూరు రూరల్ : మామిడిపల్లిలో చెట్టుకు రాఖీకడుతున్న విద్యార్థినులు

పార్వతీపురం ఆంధ్రజ్యోతి/పార్వతీపురం టౌన్/ రూరల్ సాలూరు/గుమ్మలక్ష్మీపురం/ సాలూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా రక్షాబంధన్ కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అన్నదమ్ములకు సోదరిలు రాఖీలు కట్టారు. పార్వతీపురంలోని ఓంశాంతి మందిర నిర్వాహకులు జ్ఞానరత్నం మునిసిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావుకు రాఖీని కట్టారు. ● సాలూరులోని తన నివాసంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పలువురికి రాఖీలుకట్టారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, మండలాల అధ్యక్షులు ప్రసాద్‌బాబు, పరమేష్, వేణు,వెంకటరమణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కేతిరెడ్డి చంద్రశేఖర్,అర్బన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ కునిశెట్టి భీమారావు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ముఖీ సూర్యనారాయణ,కనకరావు పాల్గొన్నారు. సాలూరు, ఏరియా ఆసుపత్రిలో సోమవారం రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. ● గుమ్మలక్ష్మీపురంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పోలూరు శ్రీనివాసరావు తదితర టీడీపీ నాయకులకు రాఖీ కట్టారు. ●సాలూరు మండలం లోని మామిడిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం చెట్టుకు రాఖీ కట్టారు. వృక్ష సంపదను రక్షించుకుంటే మనుషులతో పాటు పశుపక్ష్యాదులకు మనుగడ ఉంటుందని పేర్కొని విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ కోరుతు చెట్టుకు రాఖీ కట్టడం పలువుర్ని ఆకట్టుకున్నది. ●పార్వతీపురం మండలంలోని నరసాపురం పంచాయతీ పరిధిలో ఉన్న ఎమ్మెల్యే విజయచంద్రకు టీడీపీ మహిళా కార్యకర్తలు రాఖీలు కట్టారు.



సాలూరు: టీడీపీ నాయకులకు రాఖీ కడుతున్న సంధ్యారాణి



పార్వతీపురంటౌన్: మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు రాఖీ కడుతున్న ఓం శాంతి మందిర నిర్వాహకులు జ్ఞానరత్నం